Postal License No.VJ/220/2023-25



# నేటి పత్రిక ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL

Prajavatha-Online Telugu News

http://www.prajavartha.com

వీక్షించండి .. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ : 16-23 జనవరి 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 33 | పేజీలు : 4 | రూ. 5.00

## తెలుగుతల్లికి జలహారం... అన్నపూర్ణగా ఏపీ

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : తెలుగుతల్లికి జలహారతి పేరుతో గోదావరీ మిగులు జలాలను కర్నూలు లోని బనకచర్ల ప్రాజెక్టు కు తరలిస్తే రాయలసీమలో పాటు ప్రకాశం,నెల్లూరు జిల్లాలు కూడా సస్యశ్యామలం అవుతాయని ఏపీ సీఎం చంద్రబాబు తలపెట్టారు. బనక చర్లకు నీటిని తరలిస్తే రాష్ట్రంలో నదులు అనుసంధానం పూర్తవుతుందని,ఫలితంగా రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయని చంద్రబాబు ఈ ప్రాజెక్ట్ తలకెత్తుకున్నారు. దీనికి రూ. 80 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్రానికి తాగునీరు,సాగునీరు,రాయలసీమ పరిశ్రమలకు నీరు అందుతుంది. కాని బనకచర్ల కు రోజూ రెండు టీఎంసీ నీరు తరలించాలి. గోదావరి,బనకచర్ల అనుసంధానంతో సాగర్ నుంచి వెలుగొండ ఆయకట్టు మీదుగా బనకచర్ల కు చేరుతుంది. అక్కడినుంచి నల్లమల టన్నెల్ ద్వారా నీరు తీసుకెళ్లే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు వల్ల 80లక్షల మందికి తాగునీరు,కొత్తగా ఏడు లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుంది. దీని ప్రయాణం గోదావరి నుంచి కృష్ణా నది, నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా బొల్లాపల్లి, అక్కడినుంచి బనకచర్ల పోలవరం డ్యాం నుంచి ప్రకాశం బ్యారేజి కుడికాలువ,తాటిపూడి ఎత్తిపోతల వరకూ ఉంటుంది. ఈ ప్రాజెక్టు కు గోదావరి మిగులు జలాల్లో (సముద్రంలో కలిసే)10 శాతం మాత్రమే తరలించడం జరుగుతుంది. పోలవరం జలాశయం నుంచే వరద జలాలు తరలిస్తారు. 25వేలక్యూసెక్కుల సామర్థ్యం తో పోలవరం కుడి కాలువకు సమాంతర వరదకాలువ ఇవ్వాల్సి ఉంది. సమాంతర కాలువ ద్వారా కృష్ణా నదిపై వైకుంఠ పురం మళ్లిస్తారు. వైకుంఠ పురంవద్ద అక్విడక్ట్ నిర్మించి,నీటిని సాగర్ కుడి కాలువకు మళ్లిస్తారు. కుడికాలువ మరింత పొడిగించి బొల్లాపల్లి జలాశయాలకు చేరవేస్తారు. 200టీఎంసీల సామర్థ్యం తో జలాశయం నిర్మించాల్సి ఉంది. బొల్లాపల్లి నుంచి బనకచర్ల కు తరలిస్తారు. దీనికి వివిధ దశల్లో టన్నెల్స్,ఎత్తిపోతలు ఏర్పాటు చేయాల్సి ఉంది. నాలుగు చోట్ల టన్నెల్స్,ఎనిమిది చోట్ల పంప్ హౌస్ లు ఏర్పాటు చేయాలి. గ్రావిటీ కాలువ కూడా తవ్వాల్సిఉంది. అలాగే 4వేల మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంది. దీనికి 54వేల ఎకరాలు భూ సేకరణ చేయాల్సివుంది. కొంత అటవీ భూమి కూడా ఉంది. ఈ ప్రాజెక్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నది. నిధులు సంవృద్ధిగా ఉంటే ఈ ప్రాజెక్టు మూడేళ్లలో పూర్తవుతుంది. కాని దీనికి అంచనా వ్యయం రూ. 80వేల కోట్లలోఎవరిది ఎంతవాటానో ఇంకా నిర్ణయించలేదు. ఆలస్యమయితే అంచనా వ్యయం ఊహించని విధంగా పెరిగిపోతుంది. కాగా దీనిలో ప్రైవేట్ భాగస్వామ్యం ఉంది కనుక అనుమానాలు వద్దని, వినియోగదారులపై భారం పడనివ్వమని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇస్తున్నది. రాజస్తాన్ లో ఇలాంటి ప్రాజెక్టు లు నిర్మించారు. ఇది పూర్తయితే పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖ వరకూ నీరువెళుతుంది. ఉత్తరాంధ్ర లో వంశధార,నాగావళి అనుసంధానం పనులు ప్రారంభమయ్యాయి. మరోపక్క పట్టిసీమ ద్వారా గోదావరి, కృష్ణా అనుసంధానం జరిగింది. పోలవరం కుడి కాలువ ద్వారా కృష్ణా లోకి నీరు వస్తున్నాయి. చింతలపూడి ఎత్తిపోతల పూర్తయితే సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు స్థిరీకరణ అవుతుంది. గోదావరి,బనకచర్ల అనుసంధానం అయితే బనకచర్ల రాయల సీమకు గేట్ వే అవుతుంది. ఇప్పటికే ఉన్న హంద్రీనీవా,తెలుగుగంగ,ఎస్ఆర్బీసీ,కేసీ కెనాల్ అనుసంధానం చేస్తే కుప్పం వరకూ నీరు తరలించవచ్చు. ఈ ప్రాజెక్టులపై జలాశయాలు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు గా మారతాయి. అప్పుడు రాష్ట్రంలోని ఎక్కడికైనా నీరు తరలించే అవకాశం వస్తుంది. అందుకే బనకచర్లను గేమ్ ఛేంజర్గా భావిస్తున్నారు. ఈప్రాజెక్ట్ మూడు భాగాలుగా ఉంటుంది. గోదావరి నుంచి కృష్ణా నది వరకూ పోలవరం కుడి కాలువ సామర్థ్యం పెంచడం, తాడిపూడి సామర్థ్యం కూడా పెంచుతారు. రోజుకు రెండు టీఎంసీలు తరలించాలని లక్ష్యం. రెండో భాగంలో కృష్ణా నది నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ వరకూతరలిస్తారు. కృష్ణా బ్యారేజి ఎగువన వైకుంఠ పురం వద్ద అక్విడక్ట్ ద్వారా సాగర్ కుడి కాలువకు తరలిస్తారు. అక్కడి నుంచి బొల్లాపల్లి సామర్థ్యం పెంచి తరలిస్తారు. మూడో భాగంలో బొల్లాపల్లినుంచి బనకచర్లరెగ్యులేటర్ వరకూ సొరంగాలు, ఎత్తిపోతల ద్వారా తరలిస్తారు. మరికేంద్రపభుత్వం తన వాటా నిధులు విడుదల చేస్తే, ప్రైవేటు భాగస్వామ్యంతో పనులు మొదలు పెట్టవచ్చు. రాష్ట్రం కూడా నిధులు సేకరిస్తే ప్రాజెక్టు అనుకున్న సమయంలో పూర్తి అవుతుంది. అప్పుడు రాష్ట్రం సస్యశ్యామలం అయి అన్నపూర్ణ గా మారుతుంది. పోలవరంతోపాటు బనకచర్ల కూడా పూర్తయితే ఏపీ భవిష్యత్తు మారిపోతుంది. అమరావతి అంతర్జాతీయ నగరం కూడా వీటితో పూర్తి చేయగలిగితే మరో ముంబాయి కాగలదు. హైదరాబాద్ ను తలదన్నే నగరంగా రూపుదిద్దుకుంటుంది. ఉపాధి పెరుగుతుంది. పరిశ్రమలు వస్తాయి. విద్యాలయాలు, హాస్పిటల్స్ వస్తాయి. ఆదాయాలు పెరిగి రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుంది. ఇదంతా జరగాలంటే పాలకుల్లో చిత్తశుద్ధి,క్రేంద్ర ప్రభుత్వ సహకారం,ప్రజల మద్దతు ఉంటే సాకారం అవుతుంది. మోదీకి ఈ ప్రాజెక్టు పై నివేదిక రాష్ట్ర ప్రభుత్వం పంపనుంది. ఆర్థికమంత్రితో ఇప్పటికే మాట్లాడారు. హైబ్రిడ్ మోడల్లోనిధుల సమీకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నది. డీపీఆర్ పూర్తయితే త్వరలో టెండర్లు పిలిచే అవకాశం ఉంది.

## ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎంలకు భూమి కేటాయించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : కృష్ణా జిల్లా కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్ 20వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది లక్షల మంది ప్రాణాలు కాపాడారని, ముఖ్యంగా, విజయవాడ వరదల్లో ఎన్డీఆర్ఎఫ్ సేవలు మర్చిపోలేమని అన్నారు. ఎన్డీఆర్ఎఫ్ 18 వేలకు పైగా రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించిందని, మూగ జీవుల ప్రాణాలను కూడా రక్షించిందని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఎన్డీఆర్ఎఫ్, ఎన్ఐడీఎం ప్రాజెక్టులకు భూమి కేటాయించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి భారీ ప్యాకేజీ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. ఏపీకి కేంద్రం అందిస్తున్న సహకారం అభినందనీయమని తెలిపారు.

## స్థానిక సంస్థల్లో పోటీ చేయాలంటే ఆ నిబంధన పాటించాల్సిందే..

### చంద్రబాబు మరో కీలక నిర్ణయం..



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీలో కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకోబోతోంది. ఇన్నాళ్లు జనాభా నియంత్రణ కోసం అమలు చేసిన నిబంధనలను సడలిస్తూ కొత్తగా జనాభా పెంపు కోసం కొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన ప్రాయంగా సంకేతాలిచ్చారు. సీఎం ప్రతిపాదిస్తున్న ప్రకారం ఇకపై స్థానిక సంస్థల్లో పోటీ చేయాలనుకునేవారు తప్పనిసరిగా ఇద్దరు పిల్లలను కనాల్సివుంటుంది. ప్రస్తుతం ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు స్థానిక ఎన్నికల్లో పోటీకి అనర్హులు. 1990వ దశకంలో జనాభా నియంత్రణపై అవగాహన కోసం ఈ నిబంధనను తీసుకొచ్చారు. స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహించే పంచాయతీ వార్డు మెంబర్ నుంచి కార్పొరేషన్ల మేయర్ల వరకు అందరికీ ఈ నిబంధన వర్తిస్తుంది. ప్రజలతో నేరుగా సంబంధాలు ఉండటం వల్ల ఈ పదవులకు పోటీ చేసేవారికి జనాభా నియంత్రణపై అవగాహన ఉండాలని ఈ నిబంధనను అప్పట్లో తీసుకువచ్చారు. అయితే ప్రస్తుతం జనాభా వేగంగా తగ్గిపోతోంది. వచ్చే ఏడాదికి ఏపీ జనాభా సుమారు ఐదున్నర కోట్లు ఉంటుందని అంచనా. ఇక 2050 నాటికి ఈ జనాభాలో పెద్దగా మార్పు ఉండకపోగా, ఇంకా తగ్గే అవకాశాలు ఉన్నట్లు ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రస్తుతం అమలు చేస్తున్న నిబంధనలు యథావిధిగా పాటిస్తే భవిష్యత్తులో ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సిరావొచ్చు అంటున్నారు. వయోధికులు ఎక్కువై, యువ జనాభా తగ్గిపోయే అవకాశం ఉంటుంది. ఇది రాష్ట్ర అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని అంటున్నారు. దీంతో జనాభా పెరిగేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు యోచిస్తున్నారు. జనాభా నియంత్రణకు ప్రస్తుతం పాటిస్తున్న నియమాలు స్థానే జనాభా పెరిగేందుకు కొత్త నిబంధనలు అమలు చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. స్థానిక సంస్థల్లో పోటీ చేయాలంటే ముగ్గురు పిల్లలు ఉన్నవారు అనర్హులని ఇన్నాళ్లు అమలు చేసిన నిబంధనను ఎత్తివేస్తూ దాని స్థానంలో తప్పనిసరిగా ఇద్దరు పిల్లలు ఉండాలని నియమం విధించాలని ప్రతిపాదిస్తున్నారు. అంటే ఇద్దరికి మించిన సంఖ్యలో ఎంతమంది ఉన్నా ఎన్నికల్లో పోటీకి అర్హత ఉన్నట్లే పరిగణిస్తారు. అదే సమయంలో పిల్లలు లేని, ఒక్కరితోనే సరిపెట్టుకునే దంపతులకు ఎన్నికల్లో పోటీకి అనుమతించరు. జనాభా పెంపు అవశ్యకతను వివరిస్తూ చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రతిపాదన త్వరలో చట్టం కాబోతుందని అంటున్నారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలకు మరో ఏడాదిన్నర సమయం ఉండటంతో ఈ లోగా దీనిపై చట్టం తేవాలని ప్రభుత్వం భావిస్తోంది.

## పలు నియోజకవర్గాలకు సమన్వయకర్తలను ప్రకటించిన జగన్



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దారుణ ఓటమి చవిచూసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా పలు నియోజకవర్గాలకు పార్టీ సమన్వయకర్తలను నియమించారు. చోడవరం నియోజకవర్గానికి గుడివాడ అమర్‌నాథ్‌ను సమన్వయకర్తగా నియమించారు. మాడుగలకు బూడి ముత్యాలనాయుడు, భీమిలికి మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను), గాజువాకకు తిప్పల దేవన్‌రెడ్డి, పి.గన్నవరం నియోజకవర్గానికి గన్నవరపు శ్రీనివాసరావు, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా కరణం ధర్మశ్రీని నియమిస్తూ జగన్ ఆదేశాలు జారీచేశారు. అలాగే, వరికూటి అశోక్‌బాబును పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు.

## ఈ నెల 31 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు



ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ సమావేశాలు జనవరి 31 నుంచి నిర్వహించనున్నారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజునే ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించనున్నారు. బడ్జెట్ సమావేశాలు రెండు విడతలుగా జరగనున్నాయి. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు తొలి విడత సమావేశాలు నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1న 2025-26 వార్షిక బడ్జెట్ ను పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. ఇక, మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు రెండో విడత సమావేశాలు జరగనున్నాయి.

## ఏఐ ఫోన్ కాల్ తో ప్రధానినే టార్గెట్ చేశారు..




డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనే అంశం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ ప్రపంచంలో తీవ్ర సంచలనమైన అంశం. దీనివల్ల సాంకేతిక రంగంలో ప్రపంచం మరింత దూసుకుపోతుందని కొంతమంది చెబితే.. అదే స్థాయిలో సమస్యలూ ఉన్నాయనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ సమయంలో ఏఐ ఫోన్ కాల్ తో దేశ ప్రధానిని టార్గెట్ చేశారు సైబర్ నేరగాళ్లు. అవును... ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది గొప్ప వరంలా మారిందనే కామెంట్లు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో.. ఏఐ ఫోన్ కాల్ తో ఏకంగా దేశ ప్రధానినే మోసం చేయాలని యత్నించారు సైబర్ మాయగాళ్లు. ఈ సందర్భంగా దీనికి సంబంధించిన షాకింగ్ విషయాలూ వెల్లడించారు థాయ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రా. తాజాగా ఈ విషయాలను వెల్లడించిన థాయ్ లాండ్ ప్రధాని షినవత్రా. తనకూ తొలుత ఓ వాయిస్ మెసేజ్ వచ్చిందని. ఇందులో "మీరు ఎలా ఉన్నారు. నేను మీతో కలిసి పనిచేయాలి అని అనుకుంటున్నా" అని ఉందని వెల్లడించారు. అనంతరం ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఓ నేత గొంతుతో తనకు నేరుగా కాల్ చేసి మాట్లాడారని ఆమె తెలిపారు. అదే నంబర్ కు తిరిగి కాల్ చేయడానికి ప్రయత్నించినప్పుడు కాల్ కట్ అయ్యిందని అన్నారు. అనంతరం "అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ ఏషియన్ నేషన్స్"లోని దేశాలలో థాయ్ లాండ్ మాత్రమే విరాళం ఇవ్వలేదని.. వెంటనే ఆ విరాళాలు తమకు ఇవ్వాళని డిమాండ్ చేస్తూ మరో వాయిస్ మెసేజ్ వచ్చిందని ఆమె తెలిపారు. దీంతో... ఒక్కసారిగా అవాక్కయ్యానని అన్నారు. అయితే.. ఆ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నేత ఎవరనే విషయాన్ని మాత్రం ఆమె వెల్లడించలేదు. ఇదే సమయంలో.. ఆ ఫోన్ కాల్ ఎక్కడ నుంచి వచ్చిందనే విషయాన్ని చెప్పలేదు. ప్రస్తుతం ఈ విషయాన్ని అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లూ తెలిపారు. ఇలాంటి వాటిపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అదే సమయంలో ఈ మోసాన్ని తాను వెంటనే గుర్తించానని చెప్పిన ప్రధాని పేటోంగ్టార్న్. ప్రధాని స్థానంలో ఉన్న తనకే సైబర్ నేరగాళ్లు కాల్ చేస్తే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటనే ఆందోళన వ్యక్తం చేశారు.

## కాలుష్యం తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలి



మంగళగిరి, నేటి పత్రిక ప్రజావార్త : రోజురోజుకు విపరీతంగా పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ వాహ నాల వినియోగం పెరగాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో నిన్న పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సంస్థ ఓర్వకల్లు దగ్గర 1200 ఎకరాల్లో ఎలక్ట్రిక్ వెహికల్ పార్కు నెలకొల్పేందుకు ఏపీ ప్రభుత్వంతో ఎంఓయూ చేసుకొంది. ఇందుకు సంబంధించిన వివరాలను పీపుల్ టెక్ గ్రూప్ సీఈఓ విశ్వప్రసాద్ పవన్ కల్యాణ్‌కు వివరించారు. వాహన తయారీ, ఆర్ అండ్ డి. కేంద్రాలు, టెస్టింగ్ ట్రాక్స్, ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ ప్రాంతాలాంటివి ఇందులో ఉంటాయని చెప్పారు. దేశంలో ఇదే తొలి ప్రైవేట్ ఈవీ పార్కు అని తెలిపారు. దీని ద్వారా రూ. 13 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయనీ, 25 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. దీనిపై పవన్ కల్యాణ్ స్పందిస్తూ.. కర్నూలు జిల్లా ఓర్వకల్లు దగ్గర ఎలక్ట్రిక్ వెహికల్ పార్క్ ఏర్పాటు కానుండటం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి ఇదొక మైలు రాయిగా అభివర్ణించారు. కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కూడా ఎలక్ట్రిక్ వాహనాలు విరివిగా అందుబాటులోకి వచ్చే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో భాస్కర రెడ్డి, రవికిరణ్ ఆకెళ్ళ, బాబ్ డఫ్ఫీ, స్టీవ్ గెర్బర్, హెరాల్డ్ రక్రిజెల్ ఉన్నారు.

## అమెరికా అధ్యక్ష బాధ్యతల తర్వాత భారత్‌లో డొనాల్డ్ ట్రంప్ పర్యటన?



డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా మరికొన్ని గంటల్లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ట్రంప్ భారత్‌లో పర్యటించాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. చైనాలోనూ ట్రంప్ పర్యటించే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు ఇంగ్లీష్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. తాను అధికారం చేపట్టాక చైనా దిగుమతులపై సుంకాలు విధిస్తానని ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో బీజింగ్‌తో తన సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ఆయన ప్రయత్నిస్తున్నట్లుగా తెలుస్తోంది. అందులో భాగంగా బాధ్యతల స్వీకరణ అనంతరం చైనాలో పర్యటించనున్నారని తెలుస్తోంది. భారత్‌లో పర్యటించే అంశంపై ట్రంప్ సలహాదారులతో చర్చలు జరిపినట్లుగా తెలుస్తోంది. అదే సమయంలో త్వరలో వైట్ హౌస్‌లో జరగనున్న దేశాధినేతల సమావేశానికి భారత ప్రధాని మోదీని ట్రంప్ ఆహ్వానించనున్నారు. ఈ సమావేశం తర్వాత ట్రంప్ భారత పర్యటన ఉండనుందని తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## మోదీ, చంద్రబాబు నాయకత్వంలో అంతకు మూడింతల ప్రగతి సాధిస్తాం



ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త :కేంద్ర మంత్రి అమిత్ షా ఏపీలో పర్యటిస్తున్నారు. ఇవాళ ఆయన కృష్ణా జిల్లా కొండపావులూరులో ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇక్కడ నూతనంగా నిర్మించిన ఎన్ఐడీఎం ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా ప్రసంగించారు. తెలుగులో ప్రసంగించలేకపోతున్నందుకు అందరూ తనను క్షమించాలని నవ్వుతూ అన్నారు. ఎన్నికల్లో చరిత్రాత్మక విజయం అందించిన అందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని వెల్లడించారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం ఎల్లవేళలా సహకారం అందిస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఏ విధంగా ధ్వంసం చేసిందో అందరికీ తెలుసని, గత ప్రభుత్వం చేసిన విధ్వంసం మానవ విపత్తుకు సంబంధించినదని అన్నారు. ఆ విపత్తు నుంచి రక్షించేందుకు ఎన్డీయే కూటమి వచ్చిందని అమిత్ షా పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం గురించి చింతించవద్దని... ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల నాయకత్వంలో ఏపీలో అంతకు మూడింతల ప్రగతి సాధిస్తామని భరోసా ఇచ్చారు. గడచిన ఆర్నెల్లలోనే ఏపీకి రూ. 3 లక్షల కోట్ల విలువైన సహకారం అందించామని చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి రూ. 11,440 కోట్ల ప్యాకేజి ప్రకటించామని, ఆంధ్రుల ఆత్మగౌరవంతో ముడిపడిన విశాఖ స్టీల్ ప్లాంట్ ను ముందుకు తీసుకెళతామని చెప్పారు. గత ప్రభుత్వం అమరావతి రాజధానిని బుట్టదాఖలు చేసిందని, తాము అమరావతికి చేయూతనందిస్తామని తెలిపారు. హడ్కో ద్వారా అమరావతి నిర్మాణానికి రూ. 27 వేల కోట్ల సాయం అందిస్తున్నామని అమిత్ షా వివరించారు. ఏపీకి జీవనాడి అయిన పోలవరంపై సీఎం చంద్రబాబుతో చర్చించానని అన్నారు. 2028 లోపు ఏపీ మొత్తం పోలవరం ప్రాజెక్టు ద్వారా నీళ్లు పారిస్తామని పేర్కొన్నారు. ఏపీ అభివృద్ధి కోసం చంద్రబాబుకు ప్రధాని మోదీ అండదండలు ఉన్నాయని స్పష్టం చేశారు. విశాఖలో రూ. 2 లక్షల కోట్ల గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు వస్తున్నాయని, విశాఖ రైల్వే జోన్ ను కూడా పట్టాలెక్కించామని అమిత్ షా వెల్లడించారు.

## మొత్తానికి సాధించారు !



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : చంద్రబాబు అంటే జనాలకు ఎందుకు నమ్మకమో మరో మారు రుజువు అయింది. బాబు విజనరీ అంటారు. ఆయన డెవలప్మెంట్ కి కేరాఫ్ అడ్రస్ అంటారు. అవన్నీ ఈ తరానికి మరోసారి తెలిసి వచ్చేలా చేశారు ముఖ్యమంత్రి చంద్రబాబు. బాబు నాల్గవసారి సీఎం అయిన తరువాత పూర్తి స్థాయిలో ఏపీ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారు. కేవలం ఆరు నెలల కాలంలోనే ఆయన అమరావతి రాజధానికి ఒక రూపు ని తెచ్చే ప్రయత్నంలో సక్సెస్ అయ్యారు. అలాగే పోలవరం ప్రాజెక్ట్ పరిపూర్తికి నిర్దిష్ట గడువు పెట్టుకుని మరీ కేంద్రం నుంచి రావాల్సిన భారీ మొత్తం 11 వేల కోట్ల రూపాయలను వచ్చేలా చూసారు. ఇక నాలుగేళ్లుగా విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు కంటికి కునుకు లేకుండా పోరాటం చేస్తున్నారు. విశాఖ వాసులు సైతం కలవరపడుతున్నారు. ఉత్తరాంధ్ర అంతా ఆవేదనతో ఉంది. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ ఐదున్నర దశాబ్దాల క్రితం పోరాడిన ఏపీ జనాలు అంతా విశాఖ ఉక్కుకు ప్రైవేట్ పీడ తగలకూడదని కోటి దండాలు పెట్టుకుంటూ వచ్చారు. ఇక ఉత్తరాంధ్ర మొత్తం ఒక్కటై కూటమికి ఓటేసి గెలిపించింది కూడా విశాఖ స్టీల్ ప్లాంట్ ని చంద్రబాబు కాపాడుతారనే. ఆ విధంగా జనాలు పెట్టుకున్న ఆశలను చంద్రబాబు ఆరు నెలలు తిరగకుండానే నెరవేర్చారు. అనుకున్నది సాధించారు. నిజానికి చూస్తే అంతా పోరాటాలు చేస్తున్నారు కానీ విశాఖ స్టీల్ ప్లాంట్ చేజారింది అనే అనుకున్నారు. ఆశలు పూర్తిగా అడుగంటిపోయాయి. ఎందుకంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒకసారి నిర్ణయం తీసుకుంటే వెనక్కి తగ్గేది ఉండదని అంటారు. అయితే చంద్రబాబు మాత్రం ఈ విషయంలో పూర్తి స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. ఆయన ఆర్భాటంగా బయటకు ప్రకటనలు చేయలేదు. కానీ ఏమి చేయాలో అలా చేశారు. మొత్తానికి విశాఖ స్టీల్ ప్లాంట్ కి కొత్త ఊపిరి పోశారు. భారీ ఆర్థిక ప్యాకేజిని విశాఖ స్టీల్ ప్లాంట్ కి సాధించడం ద్వారా బాబు తన అనుభవాన్ని పరిపాలనా దక్షతను మరోసారి ఘనంగా చాటుకున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కి ఇక కొత్త ఊపిరి వచ్చినట్లు అయింది. త ద్వారా విశాఖ ఉక్కు నగరం పేరు పూర్తిగా శాశ్వతం అయినట్లు అయింది. ఉత్తరాంధ్రకు బంగారం లాంటి ప్లాంట్ కొండంత అండగా ఉంది. ఏపీకి గర్వకారణంగా విశాఖ ఉక్కు ఎవరెస్ట్ శిఖరంగా నిలిచి ఉంటోంది. ఇవన్నీ సాధించిన బాబుని నిజంగా గ్రేట్ అనే చెప్పాలని అంటున్నారు. విశాఖలో ఇటీవలనే రెండు లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకుని వచ్చి మెగా సిటీ అభివృద్ధికి శ్రీకారం చుట్టిన చంద్రబాబు ఇపుడు విశాఖ స్టీల్ ప్లాంట్ కి భారీ ప్యాకేజి ని తీసుకుని రావడం ద్వారా ఉత్తరాంధ్రా ప్రజలకు మరింతగా దగ్గర అయ్యారు. ఉత్తరాంధ్ర అంటేనే టీడీపీకి కంచుకోట. ఇపుడు ఈ నిర్ణయంతో మరోమారి కూటమి ప్రభుత్వానికి ఈ ప్రాంతీయులు అంతా జై కొడుతున్నారు. బాబు కాబట్టే విశాఖ స్టీల్ ప్లాంట్ నిలబడింది అని కీర్తిస్తున్నారు.






# విశాఖ ఉక్కుకు మంచిరోజులు

**కరుణించిన కేంద్రం..నిధుల విడుదల** **ఆగస్టు నాటికి పూర్తి స్థాయి స్థామర్థం**

ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : విశాఖ ఉక్కు కు మళ్లీ మంచిరోజులు వచ్చాయి.ఎంతో కాలంగా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకులు,కార్మికవర్గం చేస్తున్న విజ్ఞప్తికి కేంద్రం కరుణించింది.భారీగా నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.కొడిగడుతుందన్న దీపం మళ్లీ దేదీప్యమానంగా వెలిగేలా ప్యాకేజీ ప్రకటించింది. ఇటీవలకాలం వరకూ దీన్ని ప్రైవేటీకరణ చేస్తున్నారని వార్తలు వచ్చాయి.ఇటీవల విశాఖ వచ్చిన ప్రధాని మోదీ ఎలాంటి ప్రకటన చేయలేదు. విశాఖ సభలో మోదీ, చంద్రబాబు, పవన్కల్యాణ్ ఉక్కు ఫ్యాక్టరీ పై ఒక్కమాట మాట్లాడలేదని విమర్శలు వచ్చాయి. కేవలం పదిరోజుల్లో కేంద్ర కేబినెట్ ఆమోదంతో రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం విశేషం.ఈ సందర్భంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రసక్తి లేదని కేంద్రమంత్రి కుమారస్వామి ప్రకటన గమనార్హం.విశాఖ ఉక్కుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఇది పోర్ట్ ఆధారిత స్టీల్ ప్లాంటు.విశాఖ ఉక్కును ఏళ్ల తరబడి సమస్యలు వేధించాయి. ఎన్డీఏ ప్రభుత్వం 2024 లో అధికారంలోకి రావడంతో కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి విశాఖ ఉక్కును సందర్శించి వెళ్లారు.అప్పుడే ప్యాకేజీ ప్రకటిస్తారని భావించారు.కాని ఈ విషయం కేంద్రకేబినెట్ సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని చెప్పారు.కాని ఇప్పుడు కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ తక్షణమే అమలులోకి వస్తుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించడం గమనార్హం.త్వరలో మరో రెండు బ్లాస్ట్ ఫర్నేస్ లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఆగస్టు నాటికి మొత్తం మూడు బ్లాస్ట్ ఫర్నేస్ లు సిద్ధమవుతాయన్నారు. ముడిసరుకు సరఫరా కోసం ఎన్ఎండీసీ తో చర్చిస్తున్నామని కేంద్రం ప్రకటించింది. ఆత్మ నిర్భర్ భారత్‌లో విశాఖ ఉక్కు కీలకపాత్ర పోషిస్తుందని ప్రకటన చేయడం విశేషం.దేశ ఉక్కు అవసరాలు తీర్చడంలో ఈ ఫ్యాక్టరీ కీలక పాత్ర వహిస్తుందని చెప్పడం గమనార్హం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 7 నెలల్లో కేంద్రాన్ని ఒప్పించి విశాఖ ఉక్కు పై ఇచ్చిన హామీ నిలబెట్టుకుందని సీఎం చంద్రబాబు ప్రకటించారు.ఈ ప్యాకేజీ ప్రకటన చారిత్రిక నిర్ణయమన్నారు."విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు" నినాదంతో తెలుగు జాతి సాధించిందని,ఈ ఉద్యమంలో 30మంది బలిదానం చేసిన చరిత్ర ఉందన్నారు.ఈ ప్యాకేజీ ప్రకటించడం పై మోదీ,కుమారస్వామి, నిర్మలా సీతారామన్ లకు కృతజ్ఞతలు తెలిపారు.ఇది కార్మికుల విజయంగా అభివర్ణించారు. విశాఖ ఉక్కు ఏపీ ప్రజల సెంటిమెంటని,అందుకే ప్రైవేటీకరణ చేస్తారని వచ్చిన వార్తలపై రాష్ట్ర ప్రజలు ఆవేదన చెందారు. నిధులు కేటాయించాలని ఉద్యమం కూడా చేసారు.వారి ఉద్యమఫలితమే నేడు మంచిరోజులు వచ్చాయి.వాజపేయి హయాంలో రూ.1650కోట్లు కేటాయించారు.ఫ్యాక్టరీకి ఎప్పుడు ఇబ్బంది వచ్చినా ఎన్డీఏ ప్రభుత్వం ఆదుకుంది.గత ఐదేళ్లుగా ఈ ఫ్యాక్టరీ నిర్లక్ష్యానికి గురైంది. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో చేసిన కృషి ఫలించి ప్రధాని మోదీ స్పందించారు.ప్యాకేజీ ప్రకటించారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.అసాధ్యమనుకున్నది సాధించడం జరిగింది.విశాఖ ఉక్కు కు 20వేల ఎకరాలు స్థలం ఉంది.కేంద్రం ఇచ్చిన ప్రోత్సాహంతో సరైన యంత్రాంగం నియమించి వనరులను సమీకరించి సక్సెస్ చేసి చూపిస్తామని సీఎం ప్రకటించడం గమనార్హం. 1993లో రూ.8900 కోట్లతో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసారు.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీల్‌ప్లాంటు నిర్మాణం జరిగింది. 2014కు ముందు వరకు స్టీల్‌ప్లాంటు లాభాల బాటలో నడిచింది . వాజ్‌పేయి హయాంలోనూ స్టీల్‌ప్లాంటుకు నిధులు కేటాయించారు. మోదీ హయాంలో స్టీల్ ప్లాంటుకు నవరత్న హోదా వచ్చింది. 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నడిచినపుడు బాగానే ఉంది. ప్రస్తుతం స్టీల్‌ప్లాంటు రూ.35 వేల కోట్ల అప్పుల్లో ఉంది.బ్యాంకు రుణాలు, వడ్డీ, సరకు సరఫరాకు చెల్లింపులు చేయాల్సి ఉంది. రెండేళ్లలో విశాఖ స్టీల్ ప్లాంట్ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం కృషిచేయాలి.స్టీల్‌ప్లాంటును అప్పుల్లో నుంచి బయటకు తేవడమే ప్రథమ కర్తవ్యం.పూర్తిస్థాయిలో ప్లాంటు పునరుద్ధరణ తర్వాత సెయిల్‌లో విలీనంపై యోచన చేయాల్సి ఉంది. ప్లాంటు పునరుజ్జీవనానికి ఆర్థిక మంత్రి, పీఎంవోతోనూ చర్చించడంతో సఫలం అయిందని కేంద్రమంత్రి కుమారస్వామి తెలిపారు. పీఎంవోతో చర్చల తర్వాత సెప్టెంబర్‌లో రూ.500 కోట్లు విడుదల చేసారు.2024 అక్టోబర్ 9న ఆర్థికసాయానికి ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అంగీకరించారు. ఆర్థికమంత్రి సూచనలతో జీవోఎం చర్చల తర్వాత రూ.11,440 కోట్ల ప్యాకేజీకి నిర్ణయం జరిగింది.3 ఫర్నేస్‌ల ద్వారా 92.3 శాతం ఉత్పత్తి సామర్థ్యం లక్ష్యంగా సాధించాల్సి ఉంది. ఈనెల ప్లాంటు సామర్థ్యం 14 వేల టన్నులకు చేరుతుంది. 2025 జులై-ఆగస్టు నాటికి 3 ఫర్నేస్‌ల ద్వారా ఉత్పత్తి లక్ష్యం నేరం వేరే అవకాశం ఉంది. ముఖ్యంగా ముడిసరుకు కోసం గనులు కేటాయించాల్సి ఉంది.ఎప్పటినుంచో విశాఖ ఉక్కు కు సొంత గనులు ఉంటే రాణిస్తుంది నిపుణులు సూచిస్తున్నారు.కాని ప్రభుత్వాలు పట్టించుకోలేదు.ఇప్పటికైనా విశాఖ ఉక్కు కు సొంత గనులు కేటాయించాలని కార్మికులు, మేధావులు నుంచి డిమాండ్ చేస్తున్నారు.లాభాలబాట పట్టాలంటే,పూర్తి స్థాయి సామర్థ్యం తో పాటు సొంత గనులు ఉన్నప్పుడే సాధ్యమవుతుంది.అందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలి. ఆంధ్రుల హక్కు గా సాధించుకున్న విశాఖ ఉక్కు పదికాలాలపాటు మనగలిగి,పూర్వవైభవం సంతరించుకోవాలని ఆశిద్దాం.

# మార్కెట్ వ్యవస్థ అభివృద్ధి చేయాలి

**దళారీ వ్యవస్థ రూపుమాపాలి:జీఎస్టీ తగ్గించాలి**

గిట్టుబాటు ధర లేక రైతులు,నిత్యావసరాల ధరలు పెరిగి వినియోగదారులు దోపిడీకి గురవుతున్నారు.సరైన మార్కెట్ వ్యవస్థ లేకపోవడం వల్ల అటు ప్రభుత్వాలు,ఇటు ప్రజలు నష్టపోతున్నారు.ప్రభుత్వం దళారీ వ్యవస్థ ను తప్పించలేక పోతున్నది.వీటికి తోడు ప్రభుత్వం జీఎస్టీ పేరుతో వడ్డింపులు మరింత భారంగా మారుతున్నాయి.ద్రవ్యోల్బణం అదుపు చేయలేక పోవడంతో జీవనభారం సామాన్యుడికి రోజురోజుకు పెరుగుతోంది.గత 8మాసాలుగా ద్రవ్యోల్బణం అధికంగా పెరగడంతో ప్రజల కొనుగోలుశక్తి క్షీణించినట్లు ఒక అంచనా. ద్రవ్యోల్బణం 7.1శాతంగా ఉంది.నిత్యావసరాలపై జీఎస్టీ భారం పెరగడంతో కుటుంబ ఖర్చులు పెరిగిపోతున్నవని..పొదుపు సన్నగిల్లుతుందని,కుటుంబరుణాలు జీడీపీలో 6.4 శాతానికి చేరాయని ప్రతిపక్ష కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది.ఆర్బీఐ లెక్కల ప్రకారం భారతీయ కుటుంబాల ఆదాయాలు తగ్గి,రుణాలు పెరుగుతున్నాయని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది.తాకట్టు రుణాలు 56 శాతం పెరిగాయని,విటిలో 30శాతం డీఫాల్ట్ గా మారుతున్నాయని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది.రూపాయి మారక విలువ కనిష్ట స్థాయికి చేరడంతో విదేశీ నిధులు తరలివెళుతున్నాయంది.అలాగే చిన్న మదుపుదారులకు నష్టం వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.ఇటీవల కాలంలో సుగర్ కోటెడ్ పాప్ కార్న్ పై అత్యధికంగా జీఎస్టీ విధించడంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. వినోదం కోసం సినిమా కు వెళ్లే కుటుంబాలకు ముఖ్యంగా మధ్యతరగతి వారికి ఖర్చు అధికమవుతున్నది.ప్రపంచంలో అత్యధికంగా జీఎస్టీ విధించే దేశం భారత్ అని విమర్శలు ఉన్నాయి.అందుకు ఉదాహరణగా ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ వస్తువులు,మోటార్ వాహనాలు,కారు,బైక్స్,వాల్ టైల్స్,సిమెంట్ మీద గరిష్టంగా 28 శాతం గా ఉంది. ఆరోగ్య ఇన్స్యూరెన్స్, జీవిత భీమా,పాత కారుల అమ్మకం,వృత్తిపన్ను,ఐరన్,స్టీల్స్ పై 18 శాతం జీఎస్టీ విధిస్తున్నారు. బీమా పై ముఖ్యంగా వృద్ధుల బీమాపై ఇది అధికమని విమర్శలు ఉన్నాయి.మందులు,మెడికల్ సర్వీసెస్,సానిటరీ ప్యాడ్స్, దుస్తులు,చెప్పుల మీద 12 శాతం విధిస్తున్నారు.1000రూపాయల లోపు చెప్పులు పై 5 శాతం ఉంది.నేటి ధరల మేరకు కనీసం ధర 1000 పైనే ఉంది.ఒకేదేశం,ఒకే పన్ను అంటూ జీఎస్టీ విధానాన్ని ప్రవేశపెట్టింది బీజేపీ ప్రభుత్వం. దీనిలో అనేక లోటుపాట్లు ఉన్నాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.అలాగే పెట్రోల్,డిజిల్ లను జీఎస్టీ పరిధిలో తీసుకురావాలని ఎప్పటినుంచో ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.సెస్సు,సుంకాలపేరుతో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఎడాపెడా వాదిస్తున్నారు.క్రూడ్ ఆయిల్ ధర కనిష్ఠంగా ఉన్నా పెట్రోల్ రేట్లు తగ్గడంలేదు.రైతుల ఎరువులు ధరలు విపరీతంగా పెరిగాయి.డీఏపీ కి ప్రభుత్వం సబ్సిడీ ఎత్తివేసే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తున్నది.అలాగే రైతుకు గిట్టుబాటు ధరలు లేకపోయినా బియ్యం ధరలు వినియోగదారులకు ముంటెత్తిస్తున్నాయి.బ్రాండ్ల పేరుతో 25కేజీలు రూ.1600 పైగా అమ్ముతున్నారు.అలాగే పప్పుల ధరలు రైతులకు మేలు చేయలేకపోయినా వినియోగదారుల దగ్గరకు వచ్చేసరికి ధరలు ఏమాత్రం తగ్గడంలేదు.ఏ పప్పు అయినా కేజీ ధర 100 నుంచి 200వరకూ ఉన్నాయి.ఇక కూరలు చూస్తే కిలో ధరలు రూ.60నుంచి 100 వరకూ ఉన్నాయి.సామాన్యుడు ఈ ధరలను తట్టుకోవడం చాలా కష్టంగా ఉంది.గత 8 నెలలుగా సగటున నిత్యావసర ధరలు 50 శాతంపైగా పెరిగాయని ఒక అంచనా.ప్రభుత్వాలు ద్రవ్యోల్బణం తగ్గడానికి, నిత్యావసర ధరలు అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ పెరుగుతున్నది.పంటలు వచ్చే సమయంలో రైతులకు కనిష్ట ధర ఇస్తూ, వినియోగదారుల దగ్గరకు వచ్చే వరకూ సమాచారం లోపం వల్ల వారికి ఏమాత్రం తగ్గించడంలేదు.మధ్యలో దళారులు లాభం పడుతున్నారు.ప్రభుత్వానికీ పన్ను ఆదాయం రావడంలేదు.జాతీయ మార్కెట్ వ్యవస్థ అభివృద్ధి చేస్తే అటు రైతు,ఇటు వినియోగదారుడు లాభపడతారు. అందుకు ప్రభుత్వాలు కృషిచేయాలి.

# అమిత్ షా, చంద్రబాబు సమావేశంలో కీలక అంశాలు చర్చకు వస్తాయి



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : కేంద్ర హోం మంత్రి అమిత్ షా రేపు ఏపీ పర్యటనకు రాబోతున్నారు. ఉండ వల్లిలోని చంద్రబాబు నివాసానికి ఆయన వెళతారు. వీరిద్దరూ పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. అనంతరం చంద్రబాబు నివసంలోనే అమిత్ షా భోజనం చేస్తారు. రేపు రాత్రికి విజయవాడ నొవోటెల్ హోటల్ లో ఆయన బస చేస్తారు. ఎల్లుండి గన్నవరం నియోజకవర్గం కొండపావులూరులో జరిగే ఎన్డీఆర్ఎఫ్ 20వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. చంద్రబాబుతో అమిత్ షా భేటీపై ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి స్పందించారు. ఇద్దరి మధ్య ముఖ్యమైన అంశాలు చర్చకు వస్తాయని తెలిపారు. రాజకీయ అంశాలు సైతం చర్చకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వాజ్ పేయి హయాంలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు నిధులు విడుదల చేశామని... ఇప్పుడు కూడా విడుదల చేశామని చెప్పారు. స్టీల్ ప్లాంట్ కు ప్యాకేజీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని తామే అడిగామని తెలిపారు. వైజాగ్ స్టీల్ కు కచ్చితంగా కేప్టివ్ మైన్స్ కేటాయిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కూడా కేంద్రం నిధులు ఇస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఉండటం వల్లే ఇదంతా సాధ్యమవుతోందని అన్నారు.

# నారా లోకేశ్ ఎందుకు డిప్యూటీ సీఎం కాకూడదు?:



పిఠాపురం, నేటి పత్రిక ప్రజావార్త: ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ డిప్యూటీ సీఎం కావాలంటూ కొన్ని రోజులుగా పెద్ద ఎత్తున డిమాండ్లు వినిపిస్తున్నాయి. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఇప్పటికే బాహాటంగా తమ గళాన్ని వినిపించారు. ఎన్నో అవమానాలు, సవాళ్లు ఎదుర్కొని పార్టీ కోసం ఎంతో కష్టపడిన నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేస్తే తప్పేంటని వారు ప్రశ్నించారు. తాజాగా, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నారా లోకేశ్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని స్పష్టం చేశారు. నారా లోకేశ్ టీడీపీ సభ్యత్వాల సంఖ్యను ఒక కోటి దాటించి చరిత్ర సృష్టించారని, అంతకుముందు, ఇక టీడీపీ పనైపోయిందన్న వారికి యువగళంతో దీటైన సమాధానం చెప్పారని వర్మ వివరించారు. పార్టీ కార్యకర్తల మనోభావాలకు విలువ ఇవ్వాలని, ఈ విషయంలో కొన్ని మీడియా చానళ్లు, సోషల్ మీడియా తప్పుగా ప్రచారం చేయడం సరికాదని హితవు పలికారు. "లోకేశ్ కష్టానికి తగిన ప్రతిఫలం ఉండాలని టీడీపీ శ్రేణులు అడుగుతున్నాయి దారుణంగా ఓడిపోయిన జగన్ భవిష్యత్తు ఏంటో తెలియక కొట్టుమిట్టాడుతుంటే అతడ్ని కూడా సీఎం సీఎం అంటున్నార. అది వాళ్ల పార్టీలో అభిప్రాయం. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను జనసేన క్యాడర్ సీఎం సీఎం అంటోంది. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయనను కూడా సీఎం సీఎం అనేవారు. యువగళంలో లోకేశ్‌ను కూడా సీఎం సీఎం అనేవారు కార్యకర్తల మనోభావాలను గౌరవించడంలో తప్పులేదు. అలాంటప్పుడు, కార్యకర్తలకు ధైర్యాన్ని ఇస్తున్న నారా లోకేశ్‌ను ఉప ముఖ్యమంత్రి చేయాలనడంలో తప్పేముంది?" అని వర్మ ప్రశ్నించారు. ఇది తాను చెబుతున్న మాట కాదని, టీడీపీలో కార్యకర్తలందరూ ఇదే కోరుకుంటున్నారని అన్నారు. డిప్యూటీ సీఎం కావడానికి లోకేశ్ కు ఏం తక్కువ? పార్టీ పట్ల ఆయన నిజాయతీని, నిబద్ధతను ఎవరూ శంకించలేరు అని వర్మ పేర్కొన్నారు. ఇవాళ నారా లోకేశ్ తెలుగుదేశం పార్టీకి వెన్నెముకగా ఉన్నారని కొనియాడారు. అయితే, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తీసుకునే ఏ నిర్ణయం అయినా తాము శిరసావహిస్తామని వర్మ స్పష్టం చేశారు.

# ముగిసిన సంక్రాంతి సెలవులు... విజయవాడ బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో కిటకిట



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సెలవులు ముగిశాయి. రేపటి నుంచి విద్యా సంస్థలు తిరిగి తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో, సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వచ్చిన వారు తిరుగు ప్రయాణమవుతున్నారు. దాంతో బస్సులు, రైళ్లు క్రిక్కిరిసిపోతున్నాయి. ఏపీలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పిల్లలకు సంక్రాంతి సెలవులు ముగియడంతో కుటుంబాలతో పయనమవుతున్నారు.తిరుగు ప్రయాణమవుతున్న వారితో విజయవాడ బస్ స్టేషన్, రైల్వే స్టేషన్‌లో రద్దీ విపరీతంగా పెరిగింది. పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్ఆర్టీసీ పలు ప్రాంతాలకు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేసింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాలకు ఆర్టీసీ అదనపు బస్సులు తిప్పుతోంది. ఇవాళ విజయవాడ నుంచి ఆర్టీసీ 133 అదనపు బస్సులు నడుపుతోంది. ఈ స్పెషల్ బస్సుల్లో సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నారు. అయితే, ఈ అదనపు బస్సుల్లో అడ్వాన్స్ బుకింగ్ సదుపాయం ఉండదని ఆర్టీసీ స్పష్టం చేసింది.

# ఏపీకి మరో ప్రతిష్ఠాత్మక సంస్థ.. హెచ్125 హెలికాప్టర్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్న 'ఎయిర్‌బస్?'




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్‌కు మరో ప్రతిష్ఠాత్మక సంస్థ తరలివస్తోంది! రాష్ట్రంలో హెచ్125 హెలికాప్టర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విమానాల తయారీ సంస్థ 'ఎయిర్‌బస్' నిర్ణయించినట్టు తెలిసింది. ఫ్రాన్స్‌కు చెందిన ఈ సంస్థ భారత్‌లో హెలికాప్టర్లు తయారు చేయాలని ఇప్పటికే నిర్ణయించింది. ఇందుకోసం కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గుజరాత్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను పరిశీలిస్తోంది. ఇప్పటికే ఈ రాష్ట్రాలతో సంస్థ ప్రతినిధులు చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌ను తమకు అనువైన రాష్ట్రంగా ఎంపిక చేసుకున్నట్టు సమాచారం. కియా కార్ల తయారీ పరిశ్రమ ఏర్పాటుతో అంతర్జాతీయ గుర్తింపు పొందిన అనంతపురాన్నే ఇందుకు అనువైనదిగా భావిస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు ప్రభుత్వంతో చర్చలు కూడా జరిపిందని, హెలికాప్టర్ల తయారీ యూనిట్ కోసం అనువైన స్థలాన్ని కేటాయించాలంటూ జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు కూడా అందినట్టు చెప్తున్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో అధికారికంగా ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. 'హెచ్125' అనేది సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్. ఇందులో గరిష్ఠంగా ఆరుగురు ప్రయాణించవచ్చు. పర్యాటకంగానూ దీనిని ఉపయోగించుకోవచ్చు. అలాగే, సరిహద్దుల్లో పహారా, విపత్తుల సమయంలో సహాయక చర్యలకు ఇది పూర్తి అనువుగా ఉంటుంది. గరిష్ఠంగా గంటకు 289 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా అమ్ముడవుతున్న హెలికాప్టర్ కూడా ఇదే. దీనికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఇండియాలో ఈ హెలికాప్టర్‌ను ఉత్పత్తి చేయాలని ఎయిర్‌బస్ భావిస్తోంది.

# ఏడు నెలల్లో ఏపీ ప్రభుత్వం రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించింది



ఏపీ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని బీజేపీ నేత జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కారు నడుస్తోందని... రాష్ట్రం అన్ని విధాలా పురోగమిస్తోందని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు రూ. 11,440 కోట్ల ప్యాకేజీని ప్రధాని మోదీ ఇచ్చారని జీవీఎల్ అన్నారు. విశాఖ రైల్వే జోన్ కార్యరూపం దాల్చిందని చెప్పారు. అమరావతి అభివృద్ధికి రూ. 15 వేల కోట్ల బడ్జెట్ ను కేంద్రం ఇచ్చిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు అక్టోబర్ నెలలో అడ్వాన్స్ గా రూ. 2,800 కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ కు ఇటీవల మోదీ శంకుస్థాపన చేశారని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అంశాన్ని తాను పార్లమెంట్ లో లేవనెత్తానని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంతో ఏపీకి మంచి రోజులు వచ్చాయని జీవీఎల్ అన్నారు. గత ఏడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం రూ. 4 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించిందని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. సంక్రాంతి వేడుకలు ఘనంగా జరగడం సంతోషాన్ని కలిగించిందని చెప్పారు. ఇక, సైబర్ నేరాల పట్ల అందరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరస్తులు ఇంటర్నేషనల్ మాఫియాలా తయారయ్యారని చెప్పారు.

**పరాజయాలను పట్టించుకోకండి.**
**అవి సర్వసాధారణం.**
**అవే జీవితానికి మెరుగులు దిద్దేవి..**
**ఓటములే లేని జీవితం ఉంటుందా..**
- స్వామి వివేకనంద



# ఢిల్లీలో బీజేపీ గెలిస్తే అసలైన గేమ్ స్టార్ట్ ?



ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : బీజేపీకి ఇపుడు కళ్ల ముందు ఉన్న భారీ లక్ష్యం ఢిల్లీ ఎన్నికలు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 5న జరుగుతున్నాయి. మొత్తం డెబ్బై అసెంబ్లీ స్థానాలకు సంబంధించి జరుగుతున్న ఈ ఎన్నికల ఫలితాలు 8వ తేదీన వెలువడనున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తొలిసారి చివరిసారి గెలిచింది 1993లోనే అంటే మూడు దశాబ్దాలకు పైగా ఢిల్లీలో గెలుపు రుచిని బీజేపీ ఆస్వాదించలేదు అన్న మాట.దాంతో ఒక వైపు విజయం కోసం పట్టుదల గెలిచి తీరాలన్న కసితో బీజేపీ ఈసారి గెలుపే మాది అంటోంది. బీజేపీ ధీమాకు కొన్ని కారణాలు ఉన్నాయి. ఆప్ అన్న పార్టీ 2013 నుంచి అప్రతిహతంగా గెలుస్తూ వస్తోంది. ఇప్పటికి నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వ్యవహరించారు. ఈసారి కూడా ఆయన గెలిస్తే ఐదవసారి పీఠం ఎక్కి రికర్డు క్రియేట్ చేయనున్నారు.కానీ గతంలో ఉన్న ఇమేజ్ అయితే ఈసారి అరవింద్ కి లేదని అంటున్నారు. ఆయనను పన్నెండేళ్ళుగా ప్రజలు చూసారు. తమదైన తీర్పుని ఆయనకు అనుకూలంగా చాలా సార్లు ఇచ్చారు. ఈసారి గ్రౌండ్ లెవెల్ లో చూస్తే మార్పు కోరుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది. దాంతో పాటు గతంలో మాదిరిగా ఆప్ లో ఐక్యత లేదు. సీనియర్లు కూడా కొందరు దూరంగా ఉన్నారు. పార్టీలో వర్గ పోరు సాగుతోంది. ఇవన్నీ తట్టుకుని కేజ్రీవాల్ ఒంటి చేత్తో పోరాడి గెలిస్తే మాత్రం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో మైలు రాయిని దాటినట్లే అంటున్నారు. కేజ్రీవాల్ ఇమేజ్ తగ్గడం ఆప్ మునుపటిలా లేకపోవడం ప్రజలలో మార్పు కోసం తపించడం వంటివి తమకు కలసి వస్తాయని బీజేపీ అంచనా వేసుకుంటోంది. ఇక మరో వైపు చూస్తే ఢిల్లీలో చూస్తే ఒక విధంగా ట్రయాంగిల్ ఫైటింగ్ అని చెప్పాలి. ఇండియా కూటమికి పెద్దన్నగా ఉన్న కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తోంది. ఆప్ తో ఢీ కొడుతోంది. కాంగ్రెస్ ఢిల్లీని 1998 నుంచి 2013 దాకా అంటేఏకంగా పదిహేనేళ్ళ పాటు పాలించింది. దాంతో కాంగ్రెస్ కి కూడా కొన్ని సెగ్మెంట్లలో బలం ఉంది. ఓటు బ్యాంక్ కూడా ఉంది. దాంతో ఈ త్రిముఖ పోటీ వల్ల ఆప్ ఓట్లు చీలిపోయి తమకు విజయావకాశాలు బాగా పెరుగుతాయని బీజేపీ భావిస్తోంది అని అంటున్నారు. ఢిల్లీలో తాము బ్రహ్మాండమైన విజయం సాధించబోతున్నామని అపుడే బీజేపీ పెద్దలు గొప్పగా చెబుతున్నారు. బీజేపీ అనుకున్నట్లుగా ఢిల్లీలో గెలిస్తే అసలైన గేమ్ స్టార్ట్ చేస్తుంది అని అంటున్నారు. ముఖ్యంగా పార్లమెంట్ లో జమిలి ఎన్నికల బిల్లుని ప్రవేశపెట్టి ఆమోదించుకోవడం అలగే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుని ఆమోదించడంతో పాటు రాజకీయంగా దూకుడు పెంచుతుందని అంటున్నారు. ఆ దూకుడుతో ఈ ఏడాది అక్టోబర్ లో జరిగే బీహార్ ఎన్నికల్లోనూ మరోమారు సక్సెస్ కొట్టడానికి కూడా మాస్టర్ ప్లాన్ రెడీ చేస్తుందని 2026లో జరిగే తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు కూడా భారీ పొలిటికల్ యాక్షన్ ప్లాన్ ని రెడీ చేస్తుందని విపక్షాల వ్యూహాలకు అందనంత విధంగా పకడ్బందీ వ్యూహంతో వారిని చక్రబంధం చేస్తుందని అంటున్నారు. అంతే కాదు ఏపీ మీద ఫుల్ ఫోకస్ పెడుతుందని ఏపీ పాలిటిక్స్ లో కూడా బీజేపీ సరికొత్త జోరుని చూపించబోతుందని అంటున్నారు. సో అన్నింటికీ ఢిల్లీయే కీలకం కాబట్టి ఫిబ్రవరి 8న ఫలితాలు ఎలా వస్తాయి అన్నది వెయిట్ చేయాల్సిందే అంటున్నారు.

# కేంద్ర బడ్జెట్ లో ఏపీ పంట పండనుందా ?




కేంద్రంలోని నరేంద్ర మోడీ ఏపీ మీద ప్రేమను భారీగా కురిపిస్తారా అన్న చర్చ సాగుతోంది. ఈసారి కేంద్ర బడ్జెట్ లో ఏపీకి అగ్ర తాంబూలమే అని ఢిల్లీ వర్గాల భోగట్టాగా ఉంది. లేటెస్ట్ గా విశాఖ స్టీల్ ప్లాంట్ కి భారీ ఆర్థిక ప్యాకేజిని ప్రకటించిన నరేంద్ర మోడీ 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో కేంద్రం ఏపీకి బీహార్ కి పెద్ద పీట వేస్తుందని వార్తలు వస్తున్నాయి. అంతే కాదు ఎన్డీయే రాష్ట్రాలకు బడ్జెట్ లో అధిక ప్రాధాన్యత ఉంటుందని ప్రచారం సాగుతోంది. దేశంలో 28 రాష్ట్రాలు ఉంటే అందులో ఇరవై దాకా ఎన్డీయే రాష్ట్రాలు ఉన్నాయి. వీటిలో బీజేపీ పాలిత రాష్ట్రాలు సగం దాకా ఉన్నాయి. ఇలా బడ్జెట్ లో అధిక ప్రాముఖ్యత ఇవ్వాలనుకుంటే బీజేపీ రాష్ట్రాలు ఎన్డీయే రాష్ట్రాలకే ఎక్కువ కేటాయింపులు జరుపుతారని అంటున్నారు. అదే సమయంలో బీహార్ కి ప్రత్యేక ఆర్థిక సాయమే దక్కుతుందని అంటున్నారు. ఎందుకంటే బీహార్ లో ఈ ఏడాది అక్టోబర్ లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. దాంతో బీహార్ కి చాలా కీలకమైన హామీలు నెరవేర్చేందుకు తగిన ఆర్థిక సాయం అందిస్తారు అని అంటున్నారు. ఇక ఆ తరువాత ఏపీకి కూడా ఎక్కువగానే నిధులు దక్కుతాయని అంటున్నారు. ఏపీలో అమరావతి పోలవరం ఈ రెండు భారీ ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం ఫోకస్డ్ గా చేసి పెట్టుకుంది. దాంతో వీటికి కేంద్రం ఇచ్చే ఆర్థిక సాయం ఏమిటి అన్నది కూడా ఈ బడ్జెట్ లో తెలుస్తుంది అని అంటున్నారు. అదే విధంగా విభజన హామీల గురించి ఏమైనా ప్రస్తావన బడ్జెట్ లో ఉంటుందా అన్నది కూడా చర్చకు వస్తోంది. ఇదిలా ఉంటే కేంద్ర బడ్జెట్ సమావేశాలకు సంబంధించి షెడ్యూల్ రిలీజ్ చేశారు. ఈ నెల 31 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఇవి మొదటి దశ బడ్జెట్ సమావేశాలు గా కేంద్రం పేర్కొంటోంది. ఈ సమావేశాలు ఫిబ్రవరి 13 దాకా సాగుతాయి. తిరిగి రెండవ విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 10వ తేదీ నుంచి మొదలై ఏప్రిల్ 4 వరకూ జరుగుతాయి. ఇటీవల ముగిసిన శీతాకాల సమావేశాలు పెద్దగా చర్చ లేకుండానే ముగిసాయి. దాంతో బడ్జెట్ సమావేశాలు సాఫీగా జరపాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోంది. వీలైతే కీలక బిల్లులను సభలో ప్రవేశపెట్టి ఆమోదం తీసుకోవాలని చూస్తోంది. మరి ఈసారి విపక్షాలు ఏ అంశాలను ఎంచుకుని సభ ముందుకు వస్తాయో చూడాల్సి ఉంది. అంతే కాదు కేంద్ర బడ్జెట్ లో ఏమైనా వివక్ష అంటూ జరిగితే అది కూడా రాజకీయ రాద్ధాంతంగా మారే అవకాశం ఉంది అని అంటున్నారు.

# రికార్డు కలెక్షన్లతో దూసుకుపోతున్న 'సంక్రాంతికి వస్తున్నాం'..



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : విక్టరీ వెంకటేశ్ తాజా సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం' బాక్సాఫీసు వద్ద రికార్డు కలెక్షన్లను మూటగట్టుకుంటోంది. వెంకటేశ్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ కలెక్షన్లు రాబట్టిందని మూవీ మేకర్స్ చెబుతున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న థియేటర్లలో విడుదలైన సంగతి తెలిసిందే. మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్ రావడంతో రికార్డు కలెక్షన్లు రాబడుతోంది. రిలీజ్ అయిన మూడు రోజుల్లోనే సంక్రాంతికి వస్తున్నాం సినిమా వంద కోట్ల క్లబ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. శనివారం ఒక్కరోజే ఈ సినిమా రూ.31 కోట్లను కలెక్ట్ చేసిందని, ఆదివారం ఈ సంఖ్య మరింత పెరుగుతుందని చిత్రబృందం పేర్కొంది. ఐదు రోజుల్లో రూ.161 కోట్ల గ్రాస్ వసూలు చేసిందని అధికారికంగా వెల్లడించింది. విక్టరీ వెంకటేశ్ హీరోగా, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ లు హీరోయిన్లుగా తెరకెక్కిన ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్ ను అలరిస్తోంది.


అఖిల్ క్లినిక్
SK. FIROZ MD
D.O.A. & CLEP (LVP)



Timings: 5.00 PM to 9.00PM
గోసాల వంతెన దగ్గర, వణుకూరు వైపు రోడ్డు, పెనమలూరు మం॥, కృష్ణాజిల్లా.

మజ్జి లక్ష్మణరావు RMP
సెల్: 92486 01608
శ్రీ వెంకటేశ్వర ఫస్ట్‌ఎయిడ్ సెంటర్
బావాజీపేట, 1వ లైన్, బి.ఆర్.టి.ఎస్ రోడ్ దగ్గర,
విజయవాడ-520 003
EMERGENCY FIRST AID
ఎమర్జెన్సీ కేసులు అన్ని వేళలా చూడబడును

MOTHER TERESA FIRST AID CENTER



Dr.M.Sukanya Sony FAMP
D.No.24-10-50/A. Bhavajipeta,
1st line, Opp M.M.Enclave, Vijayawada - 3
Cell: 8886456887

## కుంభమేళాలో నాగసాధువు కర్రసాము... నిజంగా శివతాండవమే!



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనంగా నిలుస్తున్న కుంభమేళాలో నాగసాధువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో గత ఆరు రోజులుగా జరుగుతున్న కుంభమేళాలో నాగసాధువులు తమ వేషధారణ, విన్యాసాలతో అందరి చూపులను తమవైపు తిప్పుకుంటున్నారు. తాజాగా కొందరు నాగసాధువులు కర్రసాము ప్రదర్శించారు. వారిలో ఓ సాధువు అమితవేగంతో కర్రను తిప్పుతూ, దాదాపు శివతాండవాన్ని తలపించాడు. పొడవైన జుట్టుతో ఉన్న అతడు కర్రసాము చేస్తుంటే, శివుడు త్రిశూలంతో నర్తిస్తున్నట్టే అనిపించింది. హరహర మహాదేవ్... శంభో శంకర అంటూ ఇతర సాధువులు నినాదాలు చేస్తుండగా, ఆ నాగసాధువు తన విద్యను అద్భుతంగా ప్రదర్శించాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

## వాహనాలకు ఎరుపు, నీలం రంగు నంబర్? ప్లేట్లు!

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : మన దేశంలోనే కాదు ప్రపంచంలో ఎక్కడైనా వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరి. సదరు వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత రవాణా శాఖ వాటికి ఒక నంబర్ ను కేటాయిస్తుంది. ఈ నంబర్ ను వాహనానికి ముందు, వెనుక వైపుల నిర్దిష్టంగా కనిపించేలా ఉంచాల్సిందే. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటారు. అయితే ఆయా వాహనాల వినియోగాన్ని బట్టి వాటి నంబర్ ప్లేట్లకు వేర్వేరు రంగులు ఉంటాయన్నది మీకు తెలుసా?

తెలుపు రంగు నంబర్ ప్లేట్లు... ఇవి అందరికీ తెలిసిందే. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలోనైనా వ్యక్తిగతంగా వినియోగించే ప్రైవేటు వాహనాలకు తెలుపు రంగు నంబర్ ప్లేట్లు, వాటిపై నలుపు రంగులోని అక్షరాలు ఉంటాయి.

పసుపు రంగు నంబర్ ప్లేట్లు... వ్యక్తిగతంగా కాకుండా... వాణిజ్య, వ్యాపార పరంగా వినియోగించే వాహనాలకు పసుపు రంగు నంబర్ ప్లేట్లు, వాటిపై నలుపు రంగు అక్షరాలు ఉంటాయి. ట్యాక్సీలు, బస్సులు, ట్రక్కులపై మనం వీటిని చూడవచ్చు.

ఆకుపచ్చ నంబర్ ప్లేట్లు... పర్యావరణానికి హాని కలిగించని ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీల) కోసం ప్రత్యేకించిన నంబర్ ప్లేట్లు ఇవి. వీటిలో ఆకుపచ్చ నంబర్ ప్లేట్లపై తెలుపు రంగు అక్షరాలు ఉంటాయి.

ఎరుపు రంగు నంబర్ ప్లేట్లు... దేశంలోని దౌత్యవేత్తలు, దౌత్య కార్యాలయాలు వినియోగించే అధికారిక వాహనాలపై ఎరుపు రంగు నంబర్ ప్లేట్లు ఉంటాయి. మన దేశంలో ఉండే విదేశీ దౌత్యవేత్తల వాహనాలకు వీటిని అమర్చుతారు. వెహికల్ చెకింగ్, పలు ఇతర అంశాల నుంచి వీటికి మినహాయింపు ఉంటుంది.

నీలి రంగు నంబర్ ప్లేట్లు... మన దేశంలో తిరిగే విదేశీ అధికారిక ప్రతినిధులు, కాన్సులేట్లు, అంతర్జాతీయ సంస్థలకు సంబంధించిన వాహనాలకు నీలి రంగు నంబర్ ప్లేట్లు ఉంటాయి. వీటికి కూడా పలు అంశాల నుంచి మినహాయింపు ఉంటుంది.

నలుపు రంగు నంబర్ ప్లేట్లు...మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, వీవీఐపీలు, ప్రత్యేక భద్రత కలిగి ఉన్న వ్యక్తుల వాహనాలకు నలుపు రంగు నంబర్ ప్లేట్లు ఉంటాయి. ఒక రకంగా చెప్పాలంటే... ప్రముఖుల వాహనాలు అన్నమాట.

బాణం గుర్తులతో కూడిన నంబర్ ప్లేట్లు... కొన్ని వాహనాలపై పైకి చూపిస్తున్న బాణం గుర్తుతో కూడిన నంబర్ ప్లేట్లు ఉంటాయి. అవన్నీ భారత సైనిక దళాలకు సంబంధించిన వాహనాలు అన్నమాట. దేశంలో ఎక్కడైనా సరే ఈ వాహనాలకు వేరేగా నంబర్ ప్లేట్లు, విభిన్నమైన నంబర్లు ఉంటాయి. కేవలం సైనిక వాహనాలకే ఈ ప్రత్యేకత ఉంటుంది.

ఎరుపు రంగు నంబర్ ప్లేట్ పై నాలుగు సింహాల బొమ్మ... రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లు వంటి రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న అత్యంత ప్రముఖుల వాహనాలకు ఎరుపు రంగు నంబర్ ప్లేట్ దానిపై భారత అధికారిక చిహ్నమైన నాలుగు సింహాల బొమ్మ ఉంటాయి. దేశంలోనే అత్యంత ప్రముఖులు అన్నదానికి ఇది చిహ్నం.

## ఈపీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త.. ఇక యాజమాన్యాలతో పనిలేకుండానే అకౌంట్ ట్రాన్స్‌ఫర్

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : కారణం ఏదైనా చాలామంది కార్మికులు ఈపీఎఫ్ ఖాతాల విషయంలో తమ పూర్వ, ప్రస్తుత యాజమాన్యాల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారు. ఖాతాల బదిలీ, కంపెనీని విడిచిపెట్టిన తేదీ వెయ్యడం, ఖాతాలో వ్యక్తిగత వివరాల్లో మార్పు చేర్పులు వంటి వాటిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఉంటారు. ఉద్యోగులను ఇలాంటి సమస్యల నుంచి బయటపడేసేందుకు ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) పలు మార్పులు చేస్తూ వస్తోంది. ఇప్పటికే పలుమార్పులు తీసుకొచ్చి ఉద్యోగుల వెతలు తీర్చింది. తాజాగా ఉద్యోగులకు అనుకూలంగా మరో నిర్ణయం తీసుకుంది. ఇకపై ఖాతాల బదిలీని మరింత సరళతరం చేసింది.



యాజమాన్యాలతో ప్రమేయం లేకుండా, వారి అనుమతి లేకుండానే ఉద్యోగులు ఎవరికి వారే తమ ఖాతాలను బదిలీ చేసుకునే వెసులుబాటును నిన్నటి (శనివారం) నుంచే అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫలితంగా యాజమాన్యాల చుట్టూ తిరగడం, సమయం వృథా కావడం తప్పుతుంది. అయితే, ఈ సదుపాయం 2017 అక్టోబర్ 1వ తేదీ తర్వాత జారీ అయిన యూఏఎన్ (యూనివర్సల్ అకౌంట్ నంబర్)తో ఆధార్ అనుసంధానమైన ఖాతాలకు మాత్రమే వర్తిస్తుందని ఈపీఎఫ్ఓ తెలిపింది. వ్యక్తిగత వివరాల్లో మార్పులు, అకౌంట్ ట్రాన్స్‌ఫర్ కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారు దానిని ఉపసంహరించుకుని, ఆన్‌లైన్‌లో ఎవరికి వారే ఈ మార్పులు చేసుకోవచ్చు. అయితే, 2017కు ముందు నాటి ఖాతాలకు మాత్రం ఇది వర్తించదు. షరా మామూలుగానే వారి యాజమాన్యాలే ఈ పని చేయాల్సి ఉంటుంది.

## అమిత్ షా కు షర్మిల సవాల్...



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీ పర్యటనలో ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా విజయవాడ సమీపంలోని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ దక్షిణాది క్యాంపస్, ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ భవనాల ప్రారంభం, 20వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అమిత్ షా... మాజీ సీఎం జగన్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... వైసీపీ ప్రభుత్వ హయాం అనేది ఓ మానవ ప్రేరేపిత విపత్తు అని.. ఐదేళ్ల పాటు ఏపీలో ఆ విపత్తే సంభవించిందని.. దాని నుంచి రాష్ట్రాన్ని బయట పడేసేందుకు చంద్రబాబు-మోడీ జోడీ కృషి చేస్తుందని చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలపై ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల స్పందించారు. అమిత్ షా పై నిప్పులు చెరిగారు. ఏపీ పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై షర్మిల ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా అమిత్ షా పై ప్రశ్నల వర్షం కురిపించారు.. తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇందులో భాగంగా... అమిత్ షా వ్యాఖ్యలు చూస్తుంటే ఊసరవెల్లి సైతం సిగ్గుపడుతుందంటూ పీసీసీ చీఫ్ షర్మిల స్టార్ట్ చేశారు. 'వైసీపీ పాలన ఓ విపత్తు అయితే.. గత ఐదేళ్లలో విధ్వంసం జరుగుతుంటే.. ఢిల్లీలో కూర్చొని వేడుక చూశారా? రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనులు ఆపితే ఒక్కనాడైనా ప్రశ్నించారా? రాజధాని లేని రాష్ట్రంగా ఐదేళ్లు పాలన చేస్తుంటే కేంద్రానికి కనిపించలేదా? రూ.10 లక్షల కోట్లు అప్పులు చేస్తుంటే విధ్వంసం జరుగుతున్నట్లు అనిపించలేదా?'

'సొంత బాబాయి హత్య కేసులో ఢిల్లీలో న్యాయం కోసం పోరాటం చేస్తుంటే.. కేంద్ర హోంమంత్రిగా ఎందుకు మౌనంగా ఉన్నారు? భారీ స్థాయిలో అవినీతి జరుగుతుంటే ఒక్కటైనా బయటపెట్టారా? ఆ ఐదేళ్లూ కేంద్రంలో అధికారంలో ఉన్నది మీరే కదా?' అంటూ షర్మిల ప్రశ్నల వర్షం కురిపించారు. 'ఆ ఐదేళ్లు జగన్ మీకు దత్తపుత్రుడు' అని అన్నారు. ఇదే సమయంలో... 'గత ఐదేళ్లు వైఎస్ జగన్ పాలన విపత్తు అయితే.. ఐదేళ్లలో విధ్వంసం జరుగుతుంటే.. ఢిల్లీలో కూర్చొని వేడుక చూశారా..?' అని ప్రశ్నించిన షర్మిల.. 'పార్లమెంటులో మీ బిల్లులకు మద్దతు పలికే రబ్బర్ స్టాంపే కదా జగన్.. రాష్ట్రంలో సహజ వనరులను "మోదానీ"కి దోచిపెట్టే ఏజెంట్ జగన్' అని అన్నారు. ఈ నేపథ్యంలోనే... 'మీ ఇష్టారాజ్యంగా ఐదేళ్లు వైసీపీని వాడుకొని.. రాష్ట్ర సంపదను దోచుకొని.. ఇప్పుడు విధ్వంసం అంటూ ముసలి కన్నీరు కార్చితే రాష్ట్ర ప్రజలు నమ్మరని.. 2019-24 జరిగిన విధ్వంసంలో కర్త జగన్ అయితే.. కర్మ, క్రియ బీజేపీ ప్రభుత్వమే' అని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక.. 'గత 10 ఏళ్ల పాటు విభజన హామీలు నెరవేర్చకుండా మోసం చేసి, ఇప్పుడు అండగా ఉంటాం.. రూ.3 లక్షల కోట్లు ఇస్తాం.. పూర్వ వైభవం తెస్తాం అనే మీ మాటలు మరో మోసానికి నిదర్శనం' అని అన్నారు. ఈ సమయంలో.. మీకు ధమ్ముంటే గత ఐదేళ్ల జగన్ పాలనపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించండి అని షర్మిల సవాల్ చేశారు.









# తెలంగాణ వార్తలు



## సింగపూర్‌తో తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందం



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : సింగపూర్‌తో తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో భాగస్వామ్యం అయ్యేందుకు సింగపూర్‌కు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) ముందుకొచ్చింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో సింగపూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అధికారులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఐటీఈ పరిశీలన అనంతరం జరిగిన చర్చలు, సంప్రదింపుల మేరకు తెలంగాణలో స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి సంబంధించి సీఎం సమక్షంలో ఐటీఈ అధికారులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్?లర్ వీఎల్ వీఎస్ఎస్ సుబ్బారావు ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఇదిలా ఉండగా, సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బృందం సింగపూర్ ఐటీఈలో సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి సహా 20కి పైగా విభిన్న డొమైన్‌ల పనితీరును పరిశీలించింది. ఆయా రంగాలలో పనిచేస్తున్న నిపుణులు, సిబ్బందితో ముఖ్యమంత్రి మాట్లాడారు.

## హైదరాబాద్‌కు గుడ్ న్యూస్ చెప్పిన కిషన్ రెడ్డి!



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : రేవంత్ సర్కారు ఫోకస్ మొత్తం హైదరాబాద్ మహానగరం మీదనే ఉంది. దీనికి కారణం.. హైదరాబాద్ మహానగర రూపురేఖలు ఎంతలా మారిస్తే.. అంత రాబడితో పాటు.. ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక కష్టాలు సైతం తగ్గే వీలుంది. అధికారంచేతిలోకి వచ్చిన వేళ.. ఎడాపెడా తీసుకున్న కొన్ని నిర్ణయాలు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ కు కాస్త కష్టంగా.. రియల్ ఎస్టేట్ మార్కెట్ కు నిరుత్సాహాన్ని కలిగించేలా మారాయి. ఈ విషయాల్ని కాస్త ఆలస్యంగా గుర్తించిన రేవంత్ సర్కారు.. దిద్దుబాటు చర్యల్ని చేపట్టింది. ఇందులో భాగంగా అవసరానికి మించిన యాక్షన్ ప్రదర్శించిన హైడ్రాకు ముకుతాడు వేయటం.. అదే సమయంలో సామాన్యులకు ఇబ్బంది కలుగని రీతిలో దాన్ని నడిచేలా చేయటంతో పాటు.. మూసీ మీద జోరు తగ్గించి.. మూలన పడి ఉన్న మెట్రో ప్రాజెక్టుల ఫైళ్ల దుమ్ము దులిపిన సంగతి తెలిసిందే. ఇప్పుడున్న పరిస్థితుల్లో హైదరాబాద్ ఇమేజ్ పెంచటంతో పాటు.. పడిన రియల్ ఎస్టేట్ కు కొత్త ఊపు.. ఉత్సాహాన్ని తీసుకొచ్చేందుకు అవసరమైన రియల్ ఎస్టేట్ మార్కెట్ జోరుకు మెట్రోను భారీగా విస్తరించాలన్న ఆలోచన చేయటం తెలిసిందే. ఇప్పటికే దీనికి సంబంధించిన పలు రూట్లను ప్రభుత్వం టేకప్ చేయటమే కాదు.. కేంద్రం నుంచి అనుమతులు త్వరగా వచ్చేందుకు వీలుగా పెద్ద ఎత్తున మంతనాలు నడుపుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ.. డెవలప్ మెంట్ విషయంలో పార్టీలకు అతీతంగా వ్యవహరించేందుకు వీలుగా కేంద్రంలోని మోడీ సర్కారుతో ఆచితూచి అన్నట్లు వ్యవహరిస్తూ.. రాష్ట్రానికి అవసరమైన ప్రాజెక్టుల్ని కేంద్రం మోకాలడ్డకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మెట్రో ప్రాజెక్టుల అనుమతులను కేంద్రం త్వరగా ఇప్పించేలా వ్యవహరిస్తున్నారు. దీని ఫలితం అన్నట్లుగా తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయని చెప్పాలి. హైదరాబాద్ మెట్రో రెండో దశకు కేంద్రం సాయం చేస్తుందని.. అది తమ బాధ్యతగా పేర్కొన్నారు. రాజకీయంగా రేవంత్ సర్కారు మీద విమర్శలు సంధిస్తూనే.. తెలంగాణ రాష్ట్ర డెవలప్ మెంట్ కు అవసరమైన మెట్రో ప్రాజెక్టుకు అవసరమైన సాయం కేంద్రం నుంచి తప్పనిసరిగా ఉంటుందని చెబుతున్నారు. కిషన్ రెడ్డి చెప్పిన మాట మీదే కేంద్రం కాని నిలిస్తే.. నాలుగేళ్ల వ్యవధిలో హైదరాబాద్ మహానగరంలో దాదాపు 150 కి.మీ. పైగా కొత్త మెట్రో రైలు మార్గం వచ్చే వీలుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్ డెవలప్ మెంట్ లో సహకారం అందిస్తామన్న కిషన్ రెడ్డి మాటలు నిజమైతే.. హైదరాబాద్ కు అంతకు మించిన గుడ్ న్యూస్ ఇంకేం ఉంటుంది?

## గోమూత్రం ఔషధం.. తాగితే జ్వరం తగ్గుతుంది: ఐఐటీ మద్రాస్ డైరెక్టర్




డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : గోమూత్రం అతిపెద్ద ఔషధమని ఐఐటీ మద్రాస్ డైరెక్టర్, ప్రొఫెసర్ వి కామకోటి పేర్కొన్నారు. మన శరీరానికి హాని కలిగించే బ్యాక్టీరియాతో పోరాడే శక్తి గోమూత్రానికి ఉందన్నారు. గోమూత్రం సేవిస్తే జ్వరం తగ్గుతుందని చెప్పారు. ఈమేరకు చెన్నైలో జరిగిన ఓ పూజా కార్యక్రమంలో కామకోటి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రొఫెసర్ కామకోటి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఈ నెల 15న కనుమ పండుగ సందర్భంగా వెస్ట్ మాంబళంలోని ఓ గోశాలలో నిర్వాహకులు పూజలు చేశారు. ఈ పూజలకు ప్రొఫెసర్ కామకోటి హాజరయ్యారు. ఈ సందర్భంగా కామకోటి మాట్లాడుతూ.. ఓసారి తన తండ్రికి జ్వరం వస్తే ఓ సన్యాసిని ఆశ్రయించారని, వైద్యుడి వద్దకు వెళ్లే విషయంపై ఆయన సలహా అడిగారని చెప్పారు. జ్వరానికి వైద్యుడి వద్దకు వెళ్లాల్సిన అవసరంలేదని చెబుతూ గోమూత్రం తాగాలని ఆ సన్యాసి సూచించారని వివరించారు. తన తండ్రి గోమూత్రం సేవించిన పదిహేను నిమిషాల్లోనే జ్వరం తగ్గిందని ప్రొఫెసర్ కామకోటి తెలిపారు. గోమూత్రంలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయని, మన శరీరంలోని చెడు బ్యాక్టీరియాను అవి అంతం చేస్తాయని ప్రొఫెసర్ కామకోటి వివరించారు.

## పారిశుద్ధ్య కార్మికులతో కలిసి గ్రీన్ వాక్ చేసిన సీఎం చంద్రబాబు



మైదుకూరు, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ వైఎస్సార్ జిల్లా మైదుకూరులో 'స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పారిశుద్ధ్య కార్మికులతో కలిసి గ్రీన్ వాక్ చేశారు. మైదుకూరులో రాయల సెంటర్ నుంచి జడ్పీ హైస్కూల్ వరకు గ్రీన్ వాక్ చేశారు. జడ్పీ హైస్కూల్లో సీవరేజి ట్రీట్ మెంట్ పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదరికం లేని సమాజం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అని స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా ఎడారిగా మారకుండా నాడు ఎన్టీఆర్ కాపాడారని తెలిపారు. తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు-నగరితో రాయలసీమ రతనాల సీమ కావాలని పునాది వేశారని వివరించారు. రాయలసీమలో సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థ కోసం 90 శాతం రాయితీ ఇచ్చామని చంద్రబాబు గుర్తుచేశారు. కానీ, వైసీపీ ప్రభుత్వంలో ఆ సబ్సిడీని ఎత్తివేశారని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వంలో తాము మైక్రో ఇరిగేషన్ కు 90 శాతం సబ్సిడీ ఇస్తున్నామని చెప్పారు. కడపలో ఒకప్పుడు ముఠా కక్షలు ఉండేవని, ముఠాలను పూర్తిగా అణచివేసిన పార్టీ టీడీపీ అని అన్నారు. పోలవరం ప్రాజెక్టు రాష్ట్రానికి జీవనాడి వంటిదని తెలిపారు. పోలవరం దిగువన వేల టీఎంసీల నీరు సముద్రంలోకి పోతోందని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఇంకా రూ.85 వేల కోట్లు కావాలని, పోలవరం పూర్తి చేయడమే తన కల అని వెల్లడించారు. పోలవరం నుంచి 300 టీఎంసీల నీరు వస్తే... రాయలసీమ నుంచి రతనాల సీమగా మారుతుందని వివరించారు. తాను రాయలసీమలోనే పుట్టానని, రాయలసీమ రుణం తీర్చుకుంటానని చంద్రబాబు ఉద్ఘాటించారు. రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు, బనకచర్లకు నీళ్లు తీసుకురావడమే తన జీవితాశయం అని స్పష్టం చేశారు. రాజోలిబండ ప్రాజెక్టును కూడా అభివృద్ధి చేస్తామని, 90 వేల ఎకరాలకు నీరు అందిస్తామని చెప్పారు. ఒకప్పుడు ఐటీ అంటే హేళన చేశారని, కానీ ఇప్పుడు తాము వాట్సాప్ గవర్నెన్స్ ను కూడా తీసుకువస్తున్నామని అన్నారు. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ని ఉపయోగించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. కూటమిని నమ్మి ప్రజలు ఓట్లేశారని, రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని వ్యాఖ్యానించారు. రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేసే బాధ్యత తీసుకున్నామని, రాష్ట్రంలో రోడ్లను బాగుచేస్తున్నామని చెప్పారు. తెలుగుదేశం పార్టీ పరంగా ఒక కోటి సభ్యత్వాలతో చరిత్ర సృష్టించామని చంద్రబాబు సగర్వంగా చెప్పారు. కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటున్నామని, సభ్యత్వం తీసుకున్న వాళ్లు మరణిస్తే రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు.

## తెలంగాణలో టీడీపీపై నారా లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణలో తెలుగుదేశం పార్టీని పునర్నిర్మించడంపై చర్చిస్తున్నామని ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. త్వరలోనే పార్టీ కార్యక్రమాలను ప్రారంభిస్తామని తెలిపారు. తెలంగాణలో 1.60 లక్షల మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారని... పార్టీపై తెలంగాణలో ఆశ, అభిమానం ఉన్నాయని అన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు లేకుండానే ఇంతమంది సభ్యత్వాలు తీసుకోవడం గొప్ప విషయమని చెప్పారు. దివంగత ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద లోకేశ్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలుగువారిని మదరాసీలు అనేవారని... అలాంటి పరిస్థితుల్లో తెలుగువారంతా మేము తెలుగువారమని గర్వంగా చెప్పుకునేలా ఎన్టీఆర్ చేశారని లోకేశ్ చెప్పారు. ఎన్టీఆర్ ఆశయాలతో పార్టీని ముందుకు తీసుకెళతామని తెలిపారు. ఎన్టీఆర్ కు 'భారతరత్న' వస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు.

## రాజకీయం కోసమే పసుపు బోర్డును ప్రకటించారు: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : రాజకీయం కోసమే పసుపు బోర్డును ప్రకటించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటును స్వాగతిస్తున్నామని, కానీ ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును మాత్రం వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ... పసుపు బోర్డు ఏర్పాటుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. దీనిని రాజకీయ కోణంలోనే ప్రకటన చేశారన్నారు. నిజంగా రైతుల కోసమే ఈ నిర్ణయమైతే పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలన్నారు.ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారన్నారు. పసుపు బోర్డు కోసం బీఆర్ఎస్ పార్టీయే పోరాటం చేసిందన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే పసుపు బోర్డు కోసం కృషి చేశానన్నారు. నిజామాబాద్‌కు విమానాశ్రయం తీసుకురావాల్సిన బాధ్యత ఎంపీ అర్వింద్‌పై ఉందన్నారు.

## రేషన్ కార్డుల జారీ అంశంపై ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు




తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : రేషన్ కార్డుల జారీ అంశంపై తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ. ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రానివారు ఆందోళన చెందవద్దని, రాష్ట్రంలోని అర్హులందరికీ కార్డులు ఇచ్చే వరకు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కులగణన, సామాజిక, ఆర్థిక సర్వే వివరాల ఆధారంగా, పాత రేషన్ కార్డుల సమాచారం ప్రకారం అర్హుల పేర్లను నమోదు చేసినట్లు తెలిపారు. అర్హులైన వారికి ఎవరికైనా కార్డులు రాకుంటే గ్రామ సభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డు ఇస్తామన్నారు.

## రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి మరీ అబద్ధాలు చెప్పారు: హరీశ్ రావు




తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సీఎం గారూ. మీ పాలనలో వేతనాలు అందక ఉద్యోగులు రోడ్డెక్కుతున్నారని మండి పడ్డారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇచ్చిన హామీలు అమలు చేశామని ఢిల్లీకి వెళ్లి మరీ అబద్ధాలు చెప్పారన్నారు. ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చిరు ఉద్యోగుల కష్టాలు కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. నాలుగు నెలలుగా పంచాయతీ కార్మికులు, మూడు నెలలుగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులు, నెల గడిచినా మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక కష్టాలు పడుతున్నారన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓలు ఇలా వేలాదిమంది చిరు ఉద్యోగులు... తమకు వేతనాలు చెల్లించాలంటూ ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్న దయనీయ పరిస్థితి నెలకొందన్నారు. నెలలు గడిచినా వేతనాలు రాకపోవడంతో చిరు ఉద్యోగులకు కుటుంబ పోషణ భారమై, అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుర్చీని కాపాడుకోవడం కోసం ఢిల్లీకి చక్కర్లు కొట్టడం, విదేశాలకు వెళ్లి వేల కోట్ల పెట్టుబడులు తెస్తున్నామని డబ్బా కొట్టుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి పాలనపై దృష్టి సారించాలన్నారు.

## పాకిస్థానీ మహిళ సీమా హైదర్ వ్యవహారంలో మరో మలుపు



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఆన్‌లైన్‌లో పరిచయమైన యువకుడి కోసం సరిహద్దులు దాటి వచ్చేసిన పాకిస్థానీ మహిళ సీమా హైదర్ గ్రేటర్ నోయిడాలో సెటిలైన విషయం తెలిసిందే. యూపీ యువకుడు సచిన్ మీనాను పెళ్లి చేసుకుని తన పిల్లలతో కలిసి కాపురం పెట్టింది. 2023లో జరిగిన ఈ ఘటన రెండు దేశాల్లో సంచలనం సృష్టించింది. తాజాగా ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. తన పిల్లలను తనకు అప్పగించాలంటూ సీమా హైదర్ మొదటి భర్త గులామ్ భారత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాడు. సీమా హైదర్ కు తనకు నలుగురు పిల్లలు కలిగారని, ఆమె పిల్లలను తీసుకుని భారత్ వచ్చేసిందని ఆయన చెప్పారు. పిల్లల అప్పగింత కోసం పాకిస్థానీ మానవ హక్కుల న్యాయవాదిని గులామ్ ఆశ్రయించాడు. న్యాయవాదితో కలిసి భారత్ కు చెందిన మరో లాయర్ సహకారంతో న్యాయస్థానం ద్వారా తన పిల్లలను వెనక్కి రప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు గులామ్ వివరించాడు.

## ఇప్పటి వరకు 8.70 లక్షల మంది రక్తదానం చేశారు



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రజలకు ఎన్టీఆర్ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని నారా భువనేశ్వరి చెప్పారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే మహా నటుడు ఎన్టీఆర్ అని అన్నారు. రాజకీయరంగంలో ఆయన చెరగని ముద్ర వేశారని చెప్పారు. ఎన్టీఆర్ సేవలను ముందుకు తీసుకెళ్లేందుకే ఎన్టీఆర్ ట్రస్టును ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ఆమె నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్టీఆర్ ప్రతి వర్ధంతికి లెజెండరీ బ్లడ్ డొనేషన్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని భువనేశ్వరి తెలిపారు. మీరు ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు, మరొకరి జీవితంలో సంతోషాన్ని ఇస్తుందని చెప్పారు. ఇప్పటి వరకు ఎన్టీఆర్ ట్రస్టుకు 8.70 లక్షల మంది రక్తదానం చేశారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, తలసేమియా వ్యాధిగ్రస్తులకు రక్తాన్ని అందించామని చెప్పారు. హైదరాబాద్ చర్లపల్లిలోని ఎన్టీఆర్ ట్రస్టు స్కూల్లో ఉచిత విద్య, వసతి, భోజనం కల్పిస్తున్నామని తెలిపారు. మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్స్ అందిస్తున్నామని చెప్పారు. కరోనా, తుపాన్ల సమయంలో అనేక సేవలు అందించామని వెల్లడించారు.

